

రఘునాథ్‌నగర్‌లో ధర్నా చేస్తున్న స్థానికులు

రఘునాథ్‌నగర్‌లో వైన్‌షాపు ఏర్పాటు చేయెద్దు

అంబర్‌పేట, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): జనావాసాల మధ్య వైన్‌షాపు పెట్టరాదని డిమాండ్ చేస్తూ అంబర్‌పేట డివిజన్ రఘునాథ్‌నగర్ బస్తీవాసులు సోమవారం ధర్నా చేశారు. ప్రజలు నిరంతరం రాకపోకలు సాగించే ప్రాంతంలో ఎక్సైజ్ అధికారులు వైన్‌షాపు అనుమతి ఎలా ఇచ్చారని వారు ప్రశ్నించారు. వైన్ షాపులో పర్మిట్ రూమ్ పేరుతో నిబంధనలను అతిక్రమించి పెద్ద పర్మిట్ రూమ్ నిర్మిస్తున్నారని వెంటనే అధికారులు దీనిని అడ్డుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఇది వరకు ఇరానీ హోటల్ పక్కన ఉన్న వైన్‌షాపునకు పార్కింగ్ సమస్య పేరుతో ఈ ప్రాంతానికి వైన్‌షాపును మారుస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి వైన్‌షాపును అక్కడి నుంచి తొలగించాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. దీనిపై కాచిగూడ ఎక్సైజ్ సీఐ సుధాకర్‌ను వివరణ కోరగా తాము నిబంధనల మేరకే వైన్‌షాపునకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. నిబంధనలను అతిక్రమించి పర్మిట్ రూమ్ నిర్మిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సంధ్యారాణి

బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలి

బర్కత్‌పుర, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): జూలై నెలలో తెలంగాణలో జరగనున్న బోనాల వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించాలని దేవాదాయ శాఖ సికింద్రాబాద్ అసిస్టెంట్ కమిషనర్ కె.ఎన్. సంధ్యారాణి అన్నారు. ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ఆలయ నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కోరారు. సోమవారం కాచిగూడ తుల్జా భవన్‌లో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాల సన్నాహక సమావేశం నిర్వహించారు. ముషీరాబాద్, సికింద్రాబాద్, ఖైరతాబాద్ నియోజకవర్గాలలోని అమ్మవారి ఆలయాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మవారి ఆలయాలను సుందరంగా అలంకరించాలని ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయం చేస్తుందన్నారు. సమావేశంలో గాంధీనగర్ ఇన్‌చార్జి ఏసీపీ వై. మొగులయ్య, సుల్తాన్‌బజార్ ఏసీపీ శంకర్, హిమాయత్‌నగర్ తహసీల్దార్ సంధ్యారాణి, చిక్కడపల్లి సీఐ సీతయ్య, దోమలగూడ సీఐ శ్రీనివాస్ రెడ్డి, ముషీరాబాద్ సీఐ నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

పైడి లక్ష్మయ్య, సంజీవరెడ్డి పురస్కారాల ప్రదానం

చిక్కడపల్లి, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): పాలనారంగంలో దక్షతతో వ్యవహరించి ప్రజాశ్రేయస్సుకు పాటుపడిన పైడి లక్ష్మయ్య, వారి కుమారుడు సంజీవరెడ్డి నేటితరాలకు ఆదర్శమూర్తులని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కోదండరామ్ అన్నారు. పైడి లక్ష్మయ్య ట్రస్ట్, రసమయి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి త్యాగరాయగానసభలో పైడి లక్ష్మయ్య పైడి సంజీవరెడ్డిల పేరిట పురస్కారాల ప్రదాన సభ జరిగింది. జస్టిస్ కోదండరామ్ పురస్కారాలను వీణా వాదన నిపుణురాలు కల్యాణికి, సినీ దర్శకుడు రేలంగి నరసింహారావుకు, గనులశాఖ పూర్వ డైరెక్టర్ వీడీ గోపాల్‌కు, ఆధ్యాత్మికవేత్త జగదీష్‌బాబుకు బహూకరించి మాట్లాడారు. తండ్రి లక్ష్మయ్య కుమారుడు సంజీవరెడ్డిలో పలు పోలికలు ఉన్నాయని ఇరువురూ పాలనపరంగా సంస్కరణలు చేపట్టారని రచయితలు కూడా అని వివరించారు. తెలంగాణ సారస్వతపరిషత్ అధ్యక్షుడు శివారెడ్డి, నరసింహ, నారాయణ, రాము పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి కరాటే పోటీలలో 10 బంగారు పతకాలు, 4 రజత పతకాలు, 3 కాంస్య పతకాలు సాధించిన సెయింట్ జోసెఫ్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు.
- బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి



పోలీసుల అదుపులో రౌడీషీటర్లు

రౌడీ షీటర్లకు రిమాండ్

చిక్కడపల్లి, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళను గాయపర్చిన కేసులో ఇద్దరు రౌడీ షీటర్లకు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య తెలిపిన వివరాల ప్రకారం... నాగమయ్యకుంట నివాసి అంజమ్మ అనే మహిళను బాలకృష్ణ, అనిల్ అనే రౌడీ షీటర్లు కొట్టి గాయపర్చడంతో బాధితురాలు ఈ నెల 22న పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. కేసు రిజిష్టర్ చేసి నిందితులను అరెస్ట్ చేసి నాంపల్లి కోర్టులో హాజరుపర్చగా వారిద్దరికి 14 రోజుల రిమాండ్ విధించడంతో చంచల్‌గూడ జైలుకు తరలించినట్లు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ గిరిధర్, కాచిగూడ ఏసీపీ రఘు

చైన్ స్నాచర్, మరో ఇద్దరి అరెస్ట్


అంబర్‌పేట, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): విలాసాలకు అలవాటుపడిన భార్య కోరికలు తీర్చడానికి చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఓ ఈవెంట్ ఆర్గనైజర్‌ను, సహకరించిన మరో ఇద్దరిని అంబర్‌పేట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం అంబర్‌పేట పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈస్ట్‌జోన్ డీసీసీ గిరిధర్, కాచిగూడ ఏసీపీ రఘు, అంబర్‌పేట సీఐ అశోక్‌లు మాట్లాడారు. ఆదిలాబాద్ జిల్లా మందమర్రికి చెందిన గడ్డం సునీత్‌కుమార్ ఆలియాస్ బన్ని(24) ఉప్పల్ కల్యాణిపూర్‌లో నివాసం ఉంటూ డక్కన్ ఈవేంట్స్‌లో ఆర్గనైజర్‌గా పనిచేస్తున్నాడు. అయన భార్యకు జల్సాల మోజు ఎక్కువగా ఉండడంతో తాను సంపాదించిన డబ్బు సరిపోక చైన్‌స్నాచింగ్‌లు చేస్తున్నాడు. ఈ నెల 19వ తేదీ అంబర్‌పేట డీడీ కాలనీలో పారిజాత అనే రిటైర్డ్ ఉద్యోగిణి మెడలోని చైన్ తస్కరించి పారిపోయాడు. ఈ కేసులో పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి నిందితుడిపై నిఘా పెట్టారు. చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డ సునీత్‌కుమార్ ఈ విషయాన్ని తన స్నేహితుడు ఈసీఐఎల్ కమలానగర్‌కు చెందిన రవికి చెప్పి చైన్‌ను ఆయనకు ఇచ్చాడు. రవి చైన్‌ను ఈసీఐఎల్ కమలానగర్‌కు చెందిన వడ్డీ వ్యాపారి రాజేష్‌రాథోడ్ వద్ద కుదువ పెట్టి 65 వేలు తీసుకున్నాడు. ఈ డబ్బును ఆయన తన స్నేహితుడు సునీత్‌కుమార్‌కు ఇచ్చాడు. సునీత్‌కుమార్, ఆయన భార్య ఇద్దరు వచ్చిన డబ్బులతో గోవాకు వెళ్లి వచ్చారు. ఈ విషయం తెలిసిన పోలీసులు వారిపై నిఘా పెట్టి ఈ నెల 23వ తేదీ సునీత్‌కుమార్, రవి, రాజేష్‌రాథోడ్ యాప్రాల్ కల్యాణ్‌పూరిలో బైక్‌పై వెళ్తుండగా వారిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. వారి నుంచి రెండు తులాల బంగారు చైన్, ఒక బైక్, రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. నేరానికి పాల్పడిన ముగ్గురిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో అంబర్‌పేట డీఐ మల్లేశ్వరి, ఎస్ఐ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే తోపుడుబండ్ల వ్యాపారం

- వాహనాల రాకపోకలకు ఇబ్బందులు

నల్లకుంట, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్‌లోని శంకరమఠం కూరగాయల మార్కెట్‌లో తోపుడు బండ్లతో కూరగాయలు, పండ్ల వ్యాపారాలు నిత్యం జరుతున్నాయి. ఉదయం సాయంత్రం వేళల్లో ఈ కూరగాయల మార్కెట్ నుంచి వాహనదారులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బందులకు గురవుతున్నారు. పలుమార్లు ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి జరిమానాలు వేసి ట్రాఫిక్ పీఎస్ సీఐ హెచ్చరించినా పరిస్థితిలో ఎలాంటి మార్పు రావడం లేదు. నల్లకుంటలోని శంకరమఠం కూరగాయల మార్కెట్ అప్పట్లో 50 నుంచి 60 ఫీట్ల వెడల్పుతో రోడ్డు ఉండగా ప్రస్తుతం 25 నుంచి 30 ఫీట్లకు తగ్గిపోయింది. శంకరమఠం కూరగాయల మార్కెట్ మెయిన్ రోడ్డు నుంచి పాతనల్లకుంట శ్రీరామాలయం వీధి, అచ్చయ్యనగర్ వరకు రోడ్డు మరింత ఇరుకుగా తయారైంది. తద్వారా నిత్యం ఉదయం సాయంత్రం వేళల్లో రాకపోకలు సాగించడం ఇబ్బందికరంగా మారింది.

పండుగల సందర్భంగా అయితే ఈ మార్కెట్‌లో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రంగా ఉంటుంది. మార్కెట్ రోడ్డును పునరుద్ధరించాలని ప్రజలు పలువురు వాహనదారులు కోరుతున్నారు. సోమవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో నల్లకుంట సిటిజన్స్ అసోసియేషన్ (ఎన్‌సీఏ) అధ్యక్షుడు వి. మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి డి. మోహన్‌నాయుడు, కోశాధికారి వి.శ్రీనివాస్‌రావు, నిర్వహణ కార్యదర్శి కె. వీరయ్య, సహాయ కార్యదర్శి కె. కిరణ్‌కుమార్, రమేష్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీవాత్సవను కలిసి వినతిపత్రం సమర్పించారు. స్పందించిన అసిస్టెంట్ కమిషనర్ ఈ విషయంపై వెంటనే పరిష్కారం చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది.



నల్లకుంట శంకరమఠం రోడ్డులో కూరగాయల మార్కెట్



మాజీ ఎంపీ హనుమంతరావును సన్మానిస్తున్న కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణగౌడ్, నాయకులు

బడుగు బలహీన వర్గాలకు కాంగ్రెస్ పార్టీలో తగిన గుర్తింపు

- మాజీ ఎంపీ వి. హనుమంతరావు

రాంనగర్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాల నాయకులకు కాంగ్రెస్ పార్టీలో తగిన గుర్తింపు ఎప్పటికీ ఉంటుందని మాజీ ఎంపీ వి. హనుమంతరావు అన్నారు. పార్టీని నమ్ముకొని పార్టీ పటిష్టత కోసం పనిచేసే వారికి ప్రభుత్వ నామినేటెడ్ పదవులు వస్తాయని, పార్టీ పదవులు లభిస్తాయన్నారు. సోమవారం బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని రెడ్ బిల్డింగ్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణాగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో పాల్గొన్న హనుమంతరావును సత్కరించారు. ఈ సందర్భంగా వి హెచ్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ నాయకత్వంపై ప్రజల్లో ఎంతో విశ్వాసం పెరిగిందన్నారు. తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమం కొనసాగుతుందని చెప్పారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలకు ఇప్పటినుంచే సిద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్‌పతి యాదగిరిగౌడ్, నాగభూషణం, లక్ష్మణ్, వెంకటేష్‌గౌడ్, దిలీప్‌కుమార్, దిలీప్‌నేత, శశిగౌడ్, విజయ్‌కుమార్, జితేందర్ తదితరులు పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ రెవెన్యూ అధికారులు

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

రాంనగర్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు లక్ష రూపాలతోపాటు తులం బంగారు ఇచ్చే హామీని అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి విఫలం చెందారని ఎమ్మెల్యే ముఠా గోపాల్ విమర్శించారు. సోమవారం రాంనగర్ డివిజన్‌లోని ఎస్ఆర్‌టీ కమ్యూనిటీ హాల్‌లో ముషీరాబాద్ తహసీల్దార్ మండలం పరిధిలో మంజూరైన 49 మంది కల్యాణలక్ష్మి, చెక్కులు, షాదీ ముబారక్ పథకం కింద మంజూరైన 81 మందికి చెక్కులను హిమాయత్‌నగర్ మండల పరిధిలో కల్యాణ లక్ష్మి పథకం కింద 6 మందికి చెక్కుల పంపిణీ చేశారు.

కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఠాగోపాల్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. అమలు కాని హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ప్రజలు ఆ పార్టీకి రాబోయే రోజుల్లో తగిన బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియానవనీన్‌గౌడ్, బీఆర్ఎస్ యువజన నాయకులు ముఠాజైసింహ, వివిధ డివిజన్‌ల అధ్యక్షులు, అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు 2 లక్షల కోట్లు కేటాయించాలి

- ఎంపీ ఆర్. కృష్ణయ్య

బర్కత్‌పుర, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని మోదీ ప్రభుత్వం జూలైలో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి 2 లక్షల కోట్ల రూపాయలు కేటాయించాలని రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. గతంలో 40 లక్షల 90 వేల కోట్ల బడ్జెట్‌లో మోదీ ప్రభుత్వం బీసీల సంక్షేమానికి కేవలం 2 వేల కోట్ల రూపాయలను మాత్రమే కేటాయించి తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. ఇదే పద్ధతి కొనసాగితే మోదీ ప్రభుత్వంపై బీసీల తిరుగుబాటు తప్పదని ఆయన హెచ్చరించారు. సోమవారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్ హోటల్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యంల సంయుక్త ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ఆదానీ, అంబానీ, బీర్లాలకు లక్షల కోట్ల రూపాయలు కేటాయిస్తున్న బీసీలకు మాత్రం బడ్జెట్‌లో కేవలం 2 వేల కోట్లను కేటాయించడం వల్ల కనీసం బిస్కెట్లు, చాక్లెట్లు కూడా రావని ఆరోపించారు. ఈ పద్ధతి మార్చుకోకపోతే దేశవ్యాప్తంగా తిరుగుబాటు తప్పదని ఆయన హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం తరహాలో మరో పోరాటానికి బీసీలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు కోల జనార్ధన్, ఉదయ్‌నేత, నందగోపాల్, వేముల రామకృష్ణ, మట్ట జయంతిగౌడ్, కె. శివమ్మ, వంశీకృష్ణ, నిఖిల్ పటేల్, పర్వతాలు, ప్రసన్న, శాంతి పాల్గొన్నారు.



సమావేశంలో అభివాదం చేస్తున్న ఎంపీ ఆర్. కృష్ణయ్య, గుజ్జ కృష్ణ, గుజ్జ సత్యం



నిరసన, ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వెంకట్‌బంజార, గణేశ్‌నాయక్ తదితరులు

లంబాడీలకు మంత్రి పదవి కోసం 28న సీఎం ఇంటి ఎదుట ధర్నా

పంజాగుట్ట, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): లంబాడీలకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28న సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి ఎదట ధర్నా చేయనున్నట్లు గిరిజన విద్యార్థి సంఘం, లంబాడీ హక్కుల పోరాట సమితి, బంజారా గిరిజన విద్యార్థి సమైక్య సంఘాల రాష్ట్ర అధ్యక్షులు వెంకట్‌బంజార, గణేశ్‌నాయక్ తెలిపారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయా సంఘాల నాయకులు పాండునాయక్, శ్రీనివాస్, సరోజబాయితో కలిసి వారు ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. జీవో 33 ప్రకారం గిరిజనులకు ఇచ్చిన పది శాతం రిజర్వేషన్ కొనసాగించాలని, కేంద్ర ప్రభుత్వం వాటిని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని, ఫిబ్రవరి 15న సంత్ సద్గురు సేవాలాల్ మహరాజ్ జయంతిని ప్రభుత్వ సెలవుగా ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు శ్రీనివాస్ నాయక్, పార్వతి, యాదమ్మ, లక్ష్మణ్ నాయక్, బన్సీలాల్‌నాయక్, సుధీర్‌నాయక్, మురళినాయక్, తదితరులు పాల్గొన్నారు.

3 గంటలు కరెంట్ లేదు..

- 1912 కు ఫోన్ చేసినా స్పందన లేదు..
- ఎక్స్‌వేదికగా విమర్శలు వ్యక్తం చేసిన బక్క జడ్సన్

హైదరాబాద్ సిటీ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): గోల్కొండ క్రాస్‌రోడ్ అజాంనగర్‌లో కంచర్ల అపార్ట్‌మెంట్‌లో సోమవారం ఉదయం మూడు గంటలు కరెంటు పోయిందని 1912కు ఫోన్ చేసినా, ట్విట్టర్‌లో పోస్ట్ చేసినా ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ నుంచి స్పందన లేదని సామాజిక కార్యకర్త బక్క జడ్సన్ ఎక్స్‌వేదికగా విమర్శించారు. హైదరాబాద్ నడిబొడ్డున కరెంట్ సరఫరా పరిస్థితి ఇలా ఉంటే ఎలా అంటూ ప్రశ్నించారు. ప్రభుత్వపాలన, అధికారుల పనితీరుకు ఇది నిదర్శనమని, కరెంటుపోయి మూడు గంటలు కావడంతో ఇన్వర్టర్‌బ్యాటరీ చార్జి అయిపోయిందని దీంతో అంధకారం నెలకొందన్నారు.

టీజీఎస్పీడీసీఎల్‌కు ట్విట్టర్‌లో ఫిర్యాదు చేస్తే యూఎస్సీ నంబర్ అడిగారని అయినా మూడు గంటలు కరెంట్ రాలేదని, కరెంటు పోయిందని ఎవరైనా ఫిర్యాదు చేస్తే జైల్లో పెడుతామంటూ బెదిరిస్తున్నారని ఇదెక్కడి న్యాయం అన్నారు. దీనిపై విద్యుత్ అధికారులను వివరణ కోరగా వర్షాల కారణంగా చెట్లు విరిగిపోయి విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తాయని తెలిపారు.

కోకాపేటలో రూ.498 కోట్లతో జీఐఎస్ సబ్‌స్టేషన్

హైదరాబాద్ సిటీ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విస్తరణ.. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా కోకాపేటలో 220/132/33 కేవీ గ్యాస్ ఇన్సులేటెడ్ సబ్‌స్టేషన్(జీఐఎస్) నిర్మాణానికి ట్రాన్స్‌కో గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రూ.498 కోట్లతో సవరించిన అంచనాలకు పరిపాలన అనుమతిలిస్తూ ట్రాన్స్‌కో సీఎండీ రిజ్వీ సోమవారం ఉత్తర్వు జారీ చేశారు. 2023 ఏప్రిల్ 6న రూ. 519.77 కోట్ల అంచనా వ్యయంతో గతంలో ఉత్తర్వులు ఇవ్వగా, దాన్ని తాజాగా సవరించారు. అంచనా వ్యయం సుమారు రూ.20 కోట్లు తగ్గించారు. కోకాపేట ఉపకేంద్రం నిర్మాణానికి రూ. 171.85 కోట్లు, కేతిరెడ్డిపల్లి- శంకర్‌పల్లి 220కేవీ నుంచి కోకాపేట వరకు 14 కిలోమీటర్ల దూరం ఓవర్‌హెడ్ విద్యుత్ లైన్లను మోనోపోల్స్‌తో నిర్మించేందుకు రూ.136.03 కోట్లు అవుతుందని అంచనా వేశారు. గచ్చిబౌలి- రాయదుర్గం 220 కేవీ నుంచి 10.5 కిలోమీటర్లు కోకాపేట వరకు మోనోపోల్స్‌తో ఓవర్ హెడ్‌లైన్లు వేసేందుకు రూ. 109.55 కోట్లు అవుతుందని అంచనాలు రూపొందించారు.



ఏపీఎన్ రాజును సన్మానిస్తున్న పద్మజ, అయోధ్య

ప్రజలకు విలువైన గ్రంథాలయ సేవలందిస్తాం

చిక్కడపల్లి, జూన్ 24(ఆంధ్రజ్యోతి): ప్రజలకు విలువైన గ్రంథాలయ సేవలను అందిస్తామని రాష్ట్ర గ్రంథాలయ శాఖ డైరెక్టర్ ఏపీఎన్ రాజు అన్నారు. ఒకనాడు దేశ స్వాతంత్ర్యానికి ప్రజలను సిద్ధం చేసిన గ్రంథాలయాలు దినదినాభివృద్ధి చెందుతూ సమాజానికి విజ్ఞానాన్ని అందిస్తున్నాయన్నారు. గ్రంథాలయ శాఖ డైరెక్టర్‌గా నియమితులైన ఏపీఎన్‌రాజును హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పొట్లూరు పద్మజ, గ్రంథాలయ ఉద్యోగుల సంఘం నేతలు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నేతలు అయోధ్య, సుకేష్‌కుమార్, బొల్లం మహేందర్,వెంకటేష్‌యాదవ్ తదితరులుపాల్గొన్నారు.

అభ్యర్థులకు మెడికల్ కోర్సు సర్టిఫికెట్ల పంపిణీ

బర్కత్‌పుర, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): మమత ఇనిస్టిట్యూట్ మెడికల్ కోర్సుకు చెందిన 15 మంది అభ్యర్థులకు సోమవారం డాక్టర్ ఎం.ఎ. బేగ్ మెడికల్ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్. కె. మెడికల్ రూబినా ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ కె.జానీబ్, డాక్టర్ సయ్యద్, నుస్రత్ ఫారీస్, డైరెక్టర్ డాక్టర్ ఎం.ఎ. బేగ్, డాక్టర్ వీణా, డాక్టర్ ముజీబ్ వాజీబ్, న్యాయ సలహాదారు మహమూద్ సాబ్ పాల్గొన్నారు.

ఆళ్వారుస్వామి ప్రతిభా అవార్డుకు అయోధ్య ఎంపిక

చిక్కడపల్లి, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ ఉద్యమనేత వట్టికోట ఆళ్వారుస్వామి ప్రతిభా అవార్డుకు గ్రంథాలయ ఉద్యోగ సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు శాగంటి అయోధ్య ఎంపికయ్యారు. ఈ నెల 30న రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కేవీ రమణాచారి ఈ అవార్డును అయోధ్యకు అందజేస్తారని కామన్‌దయాస్ సంస్థ డైరెక్టర్ కనకాచారి తెలిపారు.

రైతుబంధు నిధుల దుర్వినియోగంపై విచారణ జరపాలి

చిక్కడపల్లి, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుబంధు నిధుల దుర్వినియోగంపై విచారణ జరపాలని బహుజన లెఫ్ట్ ఫ్రంట్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు దండి వెంకట్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాళేశ్వరం, విద్యుత్ సరఫరా కొనుగోళ్లపై రాష్ట్ర కమిషన్‌లు వేసినట్లే రైతుబంధు నిధుల దుర్వినియోగంపై కూడా ఒక విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రజల సొమ్మును దోచుకున్న పెట్టుబడిదార్లపై, దోచిపెట్టిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి నిధులు దుర్వినియోగం చేసిన వారినుంచి తిరిగి నిధులు రికవరీ చేయాలని వెంకట్ డిమాండ్ చేశారు.



ధర్నా నిర్వహిస్తున్న ఐఎఫ్‌టీయూ నేతలు

కార్మిక శాఖ కమిషనరేట్ ఎదుట ఐఎఫ్‌టీయూ ధర్నా

చిక్కడపల్లి, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్స్‌ను అమలు చేయబోమని అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని తెలంగాణ కార్మిక కమిషనరేట్ ఎదుట ఐఎఫ్‌టీయూ (భారత కార్మిక సంఘాల సమాఖ్య) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత కార్మిక వ్యతిరేక విధానాలను మరింత వేగవంతం చేసిందన్నారు. నాలుగు సంవత్సరాలుగా లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా దేశ కార్మిక వర్గం పోరాటం చేస్తుంటే దాన్ని పట్టించుకోకుండా కార్మికుల శ్రమను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టడానికి నరేంద్ర మోదీ ప్రభుత్వం ఉవ్విళ్లూరుతుందని దుయ్యబట్టారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లో ఉన్న డీబీఆర్ మిల్లు కార్మికులు న్యాయంగా వాళ్లకు రావాల్సిన నష్టపరిహారం, గ్రాట్యుటీ కోసం 30 సంవత్సరాలుగా అడుగుతున్నా ప్రభుత్వం, లేబర్ కమిషనర్ కానీ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అనంతరం కార్మికశాఖ అదనపు కమిషనర్ గంగాధర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. గ్రేటర్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అరుణ, మల్లన్న, ఉపాధ్యక్షులు మనమ్మ, సత్యనారాయణ, సరోజ, మంజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లు గొడవల్లో తలదూర్చొద్దు

చిక్కడపల్లి, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు ఎలాంటి గొడవల్లో తలదూర్చొద్దని చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య హెచ్చరించారు. సంతోష్ అనే రౌడీషీటర్‌ను సోమవారం పీఎస్‌కు పిలిపించిన ఇన్‌స్పెక్టర్ అతనికి పలు సూచనలు చేస్తూ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతున్న రాబోవు రోజుల్లో బోనాలు, వినాయకచవితి ఉత్సవాలు ఉన్నందున ఎలాంటి గొడవల్లో తలదూర్చవద్దని హెచ్చరికలు చేస్తూ పలువురు రౌడీషీటర్లకు ఇప్పటివరకు కౌన్సెలింగ్‌చేసినట్లు వివరించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఇన్‌స్పెక్టర్ హితవుపలికారు.

అర్హులకు చెక్కులు అందజేయాలి

- మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్

ముషీరాబాద్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ రావడంతో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల తేదీలు కాలపరిమితి తీరడంతో ముషీరాబాద్ నియోజకవర్గంలో సుమారు 1000 మంది అర్హులకు చెక్కులు నేటికి అందలేదని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యుడు, భోలక్‌పూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్ అన్నారు. వెంటనే అర్హులకు చెక్కులను అందజేసి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కోసం దరఖాస్తు చేసుకున్న పలువురితో కలిసి వాజీద్ హుస్సేన్ ముషీరాబాద్ తహసీల్దార్ గోవర్ధన్‌ను కలిసి సమస్యను వివరించారు. స్పందించిన తహసీల్దార్ మాట్లాడుతూ లబ్ధిదారులందరికీ వారం రోజుల్లో చెక్కులను అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అబ్దుల్ కరీం, మహ్మద్ అహ్మద్, ఖాజా, నియాజ్, రహీంఉద్దీన్, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

ఆలయ స్థలంలోనే వాహనాలను నిలపాలి

ముషీరాబాద్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ దేవుని తోటలోని భవాని శంకర దేవాలయంలో టెండర్‌లో పార్కింగ్ స్థలాన్ని కైవసం చేసుకున్నవారు దేవాదాయ శాఖ కేటాయించిన స్థలంలోనే వాహనాల పార్కింగ్ చేయాలని దేవాదాయ శాఖ కార్యనిర్వాహణ అధికారి ఎం. శ్రీనివాస శర్మ సూచించారు. సోమవారం భోలక్‌పూర్‌లోని భవాని శంకర ఆలయంలోని ఖాళీ స్థలంలో వాహనాల పార్కింగ్‌కు టెండర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తీక్ రూ. 5 లక్షల 37వేలకు పార్కింగ్ స్థలాన్ని కైవసం చేసుకున్నారు. గత సంవత్సరంతో పోల్చితే రూ.2 లక్షలు అధికంగా దేవాదాయ శాఖకు ఆదాయం వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు సత్యనారాయణ, శ్రీనివాస్‌చారి, సురేష్ పాల్గొన్నారు.

జనావాసాల మధ్య స్ర్కాప్ దుకాణం

- ఇబ్బంది పడుతున్న ప్రజలు

ముషీరాబాద్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్ మహాత్మానగర్ కమ్యూనిటీ హాల్ సమీపంలో జనావాసాల మధ్య స్ర్కాప్ దుకాణం కొనసాగితుంది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని జీహెచ్ఎంసీ ఏఎంవోహెచ్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని మహాత్మానగర్ వాసులు ఆరోపిస్తున్నారు. జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు స్పందించి స్ర్కాప్ దుకాణం తొలగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



మహాత్మానగర్‌లో స్ర్కాప్ దుకాణం



అంబర్‌పేటలో ధర్నా చేస్తున్న ఈడబ్ల్యూఎస్ విద్యార్థి సంఘం నాయకులు

నీట్ పరీక్షను రద్దు చేయాలి: ఈడబ్ల్యూఎస్

అంబర్‌పేట, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): నీట్ పరీక్ష పేపర్ లీకైనందున పరీక్ష రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈడబ్ల్యూఎస్ విద్యార్థి సంఘం నేతలు సోమవారం అంబర్‌పేటలో ధర్నా చేశారు. ఈడబ్ల్యూఎస్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీగా బయలుదేరి శ్రీరమణ చౌరస్తాలో ధర్నాలో చేసి మాట్లాడారు. నీట్ పరీక్ష పత్రం లీకైందని ప్రభుత్వం చెబుతూనే కౌన్సింగ్‌కు అనుమతి ఇవ్వడం విడ్డూరమన్నారు. ప్రభుత్వం వెంటనే నీట్ పరీక్ష రద్దు చేసి తిరిగి పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.



ధర్నా నిర్వహిస్తున్న నిరుద్యోగులు

లైబ్రరీ వద్ద నిరుద్యోగుల ధర్నా

చిక్కడపల్లి, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఆరునెలలు గడుస్తున్నా జాబ్ క్యాలెండర్ విడుదల చేయకపోవడంలో ఆంతర్యమేంటని నిరుద్యోగులు ప్రశ్నించారు. సోమవారం రాత్రి చిక్కడపల్లి సిటీసెంట్రల్ లైబ్రరీ చౌరస్తాలో నిరుద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రూప్-2లో 2000, గ్రూప్-3లో 3000 ఉద్యోగాలు పెంచడంతోపాటు గ్రూప్-1లో 1100 ఎంపిక చేయాలన్నారు. కేబినెట్ నుంచి ఎలాంటి నిర్ణయం రాకపోవడంతో నిరుద్యోగులునిరాశతో ఉన్నారన్నారు. కార్యక్రమంలో నిరుద్యోగులు ప్రశాంత్‌కుమారి, శాంతి, జనార్దన్, దామోదర్, శ్వేత, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.